గంటసేపటినుంచి వర్షం అలా కుండ పోతగా, సంతతధారగా కురుస్తూనే ఉంది. ఉండుండి ఫెళఫెళార్భాటాలతో ఉరుముతూనే ఉంది. దాన్ని వెన్నంటి తృటిలో ఓ కాంతి పుంజం వెలుగొంది, కంటిలో చురుక్కుమని గుచ్చుకుంటూనే ఉంది. గాలి విసురుగా వీచినప్పుడొక జల్లు చొరవగా లోపలికి వచ్చి నిర్మల పాదాలను తాకి, అంతలోనే మళ్ళీ వెనక్కి తగ్గుతోంది.

నిర్మల స్థాణువులా అలానే కూర్చుని ఉంది. ఎప్పుడో ఈ వర్షం ముదరక ముందు, అసలు మొదలుగాకముందు, చందనపు పూతలా సోకుతూ చల్లగాలి హాయిగా నిలువెల్లా తడుముతూ ఉండే, అప్పుడు పేముకుర్చీ గుమ్మంలోకి లాక్కుని అందులోకి చేరగిలబడిపోయింది. ఆ తర్వాత నెమ్మది నెమ్మదిగా గతంలోకి జారిపోయింది.

ఇన్నేళ్ల తర్వాత ఇప్పుడు వెనక్కి తిరిగి చూసుకుంటే, తనకు మిగిలిపోయిన ఆస్తి—అప్పటి ఆ రెండేళ్ళ అనుభూతులే.

అప్పుడు తను కలలుగన్న భవితవ్యపు, చైతన్యపు ఆశాసుమాలన్నీ గగన కుసుమాలే అయినయి. మరీ మరీ

ఎదురుచూసిన జీవితానుభవాలన్నీ ఎడారి దారిన ఎదురైన మరీచికలే అయినయి.

అప్పుడవి సుందర స్వప్నాలు! ఇప్పుడవి వికృత సత్యాలు! కళ్లుమూసి కల గనటానికీ, కళ్లు తెరిచి మనగలగటానికీ మధ్య ఎన్ని యోజనాల దూరం ఉందనీ!

నిర్మల ఉస్సురని నిట్టూర్చింది, తల వెనక్కి వాల్చి, తన చుట్టూ మిగిలి ఉన్న సూన్యంలోకి చూస్తుండిపోయింది. ఇంక ఈలోకంలో తనవంక రవ్వంత జాలిగా చూసేవాళ్లు ఎవరున్నారు?

అయిపోయింది. అపచారం జరిగి, తీరని అపకారం కలిగింది. చేతులు కాలాయి. ఇంక ఎన్ని శైత్యోపచారాలు చేసి చూసినా ఇంతే. మునుపటి మృదుత్వమూ రాదు. వెనుకటి లాలిత్యమూ లేదు పైగా తనకే వికృతంగా, భయంగా...

తన పరిధిని ఎంత పరిమితం చేసుకున్నా, ఉద్యోగం కోసమైనా తను నలుగురిలోకి వెళ్లకతప్పటంలేదు. అవసరం ముందుకు నెడితే, అభిమానాన్ని చంపేసుకుని తిరుగుతోంది తను కనిపించగానే ఎదుటివాళ్ళ చూపుల్లో ఎదురయ్యే తూష్ణీభావం, తిరస్కార ఛీత్కారాలను సహించి, భరించక తప్పటమూ లేదు.

పూలు అమ్మిన ఊళ్లోనే కట్టెలమ్ముకుంటూ, కనుకొనుకుల్లోనే కన్నీళ్లు కుక్కుకుంటూ, ఈనాటికిలా దిక్కులేనిదై పోయినందుకు దిగులుగా గుటకలు మింగుకుంటూ, ఇంటికీ ఆఫీసుకు మధ్య కట్టేసిన గానుగెద్దులా, పోనీ గంగిగోవులా, వస్తూ పోతూ, పోతూ వస్తూ, పోయివస్తూ, వచ్చిపోతూ, చచ్చిపోతూ...

అవును, తనెందుకు చచ్చిపోలేదు? ఇన్నాళ్లకీ విషయం గుర్తొచ్చినందుకు లీలగా నవ్వొచ్చింది. ఇప్పుడు తను బ్రతికే ఉందా? లేదా? ఏ రోగమన్నా వచ్చి పోతే, తను పోతే ఎంత బావుండేది?

నిర్మల ఎంతోసేపు అలాగే కుర్చీలో కూర్చుండిపోయింది. ఇలా ఒంటరిగా ఉండిపోయి, తన ఆలోచనలను తనే తవ్వుకుంటూ, ఎప్పుడో పోగొట్టుకున్న దేనికోసమో వెతుక్కుంటూ కూర్చోవటం ఈ నాలుగేళ్లనుంచీ బాగా అలవాటైపోయింది. జీవితంలో ఇంకెవర్నీ నమ్మలేక, నమ్మకంగా పడిఉన్న ఈ పేముకుర్చీపై తన భారాన్నివేసి, దాని చేతులమీద సిరసంగానున్న తన చేతుల్ని వేలాడేసి, తల వెనక్కివాల్చేసి, నిశ్శబ్దపు సుద్దముక్కతో తన చుట్టూ గిరి గీసుకుని ఇలా ఒంటరిగా మిగిలిపోయి పదిలంగా దాచుకున్న హృదయపేటిక మూతతీసి, గత జ్ఞాప

కాలను రాసిపెట్టిన పాత కాగితాలను వెలికితీసి ... అదేపనిగా ఆలోచించు కుంటూ, చించుకుంటూ ... ఎప్పటికో తెలివి తెచ్చుకుని, తన తెలివిమాలిన తనానికి ఎంతగానో నొచ్చుకుని, తనను తానే నిందించుకుంటూ ఉంటోం దీమధ్య.

అపర్ణ ఇంకా కొంప జేరలేదు. దీనికీ మధ్య తిరుగుళ్లు ఎక్కువైనయి. పన్నెండు కావస్తోంది? ఇప్పటిదాకా ఇది ఎక్కడికి పోయినట్లు ? ఎక్కడికన్నా పోనీ...ఏట్లోకి... వల్లకాట్లోకి ... దీని కోసం తను భోజనం చెయ్యకుండా ఎదురుచూస్తున్నదన్న జ్ఞానమే లేదు. ఆకలి, కడుపులోని పేగుల్ని కొండ చిలువలా చుట్టుకుని పడుకుంది. నిర్మలకు దప్పికవుతోంది. కనీసం మంచినీళ్లయినా తాగాలంటే కుర్చీలో నుంచి లేవాలి, లైటువెయ్యాలి, వంటిం ట్లోకి వెళ్లాలి... బద్ధకం కదల నివ్వటం లేదు. మళ్ళీ రంగులు రంగులుగా రింగులు రింగులుగా తిరుగుతూ ఆలోచనలు...

కాలం అన్నన్ని కలల అలల్ని రేపుతూ ఉంటే, పురుషుడు చుట్టుముట్టి ఆశల వలలు విసురుతూ ఉంటే, ఆడ పిల్ల చేతికి చిక్కిన చేపపిల్లకాక మరే మవుతుంది ? ఆపైన దాని బ్రతుకేమవు తుంది ? కడకు మళ్ళీ ఆడపిల్ల కడలి పాలే అవుతుందా ? ఈ ఆద్యంతాల నడుమ కడగండ్ల వడగళ్లవానే మిగులు తుందా ?

ఓ జల్లు విసురుగావచ్చి ఆమె పాదా లను తాకింది. నిర్మల చటుక్కునపాదా లను వెనక్కి లాక్కుంది. ఇంక ఈ వాన ఇవాళ్టికి వెలవదు కాబోలు. ఏమిటో ఈ చిత్రం ? నేలపైనున్న నీరు మరిగి ఆవిరై, అంతెత్తుకు ఎగిరే మేఘ శకలాలై, తిరిగి కరిగి నీరై, నేల పాలై - అప్పుడంత ఎత్తుకు ఎగరట మెందుకూ, ఇప్పుడింత దీనంగా, హీనంగా, మట్టిపాలై పోవటమెందుకూ .. తనూ ఇంతేకదూ, నేలమీద నడుస్తూ, ఒద్దికగా జీవిస్తూండగా, నిద్రిస్తూన్న తన జీవనవనంలోకి ఆయన వచ్చి, ఎక్కడో గుండె కుదుళ్లలోని గూళ్లలో నున్న యవ్వన కోరికల శారికలను ఒక్కసారిగా రివ్వున ఎగరగొట్టి, కేరింతలుకొట్టి, తన చేయిపట్టి రారమ్మని ముందుకులాగితే...మీద పడితే, అదిమి పెడితే ... తనుమాత్రం మనిషి కాదా, మగువ కాదా ?

కుర్చీలో కూర్చున్న నిర్మల నెమ్మ దిగా కదిలింది. ఆమెకు దాహంగా ఉంది. ఈ పిల్లముండ ఇంకా రాలేదు. తేదీ మారిందిగాని, దీనికి కొంప గుర్తుకు రాలేదు. 'ఈ తద్దినం నా కొద్దు' అంటే ఆయన విన్నాడు కాదు. పైగా అన్నాడు కదా "నా మీద నీకేమాత్రం గౌరవం ఉన్నా అపర్ణను నీ కూతురులా చూసుకో."

ఆడదాన్నయి పుట్టినందుకు, అర్ధ బ్రతుకు వ్యర్థంగా గడిచినందుకు ఎప్పు డన్నా పిల్లలు లేరన్న చింత రవ్వంత కలిగినా వింత లేదుగాని ఇలాంటి రాక్షస పిల్లను తన కూతురుగా అంగీకరించ లేదు. ఆ మాటకొస్తే ఏ ఆడదీ మరొకరి కడుపున పుట్టిన పిల్లల్ని తన పిల్లలుగా చస్తే భావించలేదు. ఎవరన్నా అలా భావిస్తున్నట్లు, ప్రేమిస్తున్నట్లు కనిపిస్తే, కేవలం అలా నటిస్తున్నారన్నమాట. ఇద్దరి స్త్రీలతో ఇంత పరిచయాలు పెంచుకున్నాక గూడా ఆయనకు ఆడ దాని హృదయం తెలియలేదంటే ఏమనుకోవాలి?

అసలింతకీ తన మంచితనమే తనను వంచిస్తూ వస్తున్నది. తన మెతక దనాన్ని అలుసుగా తీసుకనే ఆయన ఆనాటినుంచీ ఈనాటిదాకా ఇన్ని విధాల ... అన్ని విధాలా అన్యాయం చేశాడు.

ఈ కృష్ణమోహనరావు అనే మోహనాకారుడు ఆనాడు తన ఇంటి పక్కకు, తన పక్కకు చేరకుండా ఉంటే, ఈనాడు తానింత హేయమైన స్థితిలో ఉండవల్సిన అవసరం ఉండి ఉండేది కాదు.

ఆయన నలభయ్యో పడిలో పడినా, పయ్యెద సర్దుకునే వయసొచ్చిన పిల్లలు ఎదిగొచ్చి ఎదమీద కూర్చున్నా, ఆయన ఇంకా ముప్ఫయి ఏళ్ల లోపుగానున్న మనిషిలాగానే కనబడతాడు. అదృష్ట వంతులు కొందరికి ఎన్నేళ్లొచ్చినా, వచ్చిన యవ్వనం అలానే నిల్చి ఉంటుంది. దురదృష్టవంతులు కొందరిని ముందరగా, తొందరగా వార్ధక్యంవచ్చి వాటేసుకుంటుంది. ఆయన మొదటి తరగతికి చెందినవాడు.

ఇందులోనే కాదు, ఎందులోనైనా ఆయనది మొదటి తరగతే. ఆయనకేం తక్కువ? వెయ్యిరూపాయలజీతం. ఇంటి నిండా బోలెడు సామాన్లూ, హంగూ, ఆర్భాటం, రయ్‌మని తిరిగి రావటానికో స్కూటరూ, ... కార్యేషు మంత్రిలాంటి భార్యా, కూతురూ, కొడుకూ...అయితే చివర చెప్పిన వాటి గురించి, తనకు చివరివాకా తెలియనివ్వలేదు.

భార్యకేదో జబ్బుచేస్తే రెండేళ్ల పాటు ఆయన అసలు కుటుంబ మంతా గుంటూర్లోనే ఉండిపోయినారు. ఈయన ఒక్కరూ ఇక్కడ ఉంటూ ఉండేవాడు. తను ఒక్కతే పక్క వాటాలో ఉంటూ ఉండేది, పగలంతా ఉద్యోగం చేసుకుంటూను, ఎంతకీ నిద్రరాక రాత్రంతా డాబామీద పచార్లు చేసుకుంటూను.

కృష్ణమోహనరావు గొప్ప మాంత్రి కుడు ఎవరిపైపేనా చూసి మెత్తగా నవ్వాడో, కాలికి ఉచ్చుతాడు బిగించి లాగాడన్నమాటే. కాసేపు మాటా మాటా



కలిపి మాట్లాడాడో, ఎంతటివాళ్లనయినా ఇట్టే బోల్తా కొట్టించాడన్నమాటే. ఆయన వ్యాపార రహస్యమంతా అక్కడే ఉంది మరి.

ఆయనెప్పుడూ ఎంతో బిజీ బిజీగా ఉంటాడు. గజిబిజీగా తిరుగుతూంటాడు. వారానికి నాలుగురోజులు ఊర్లు తిరిగి వస్తుంటాడు. తన దగ్గరకు వచ్చిన కాసేపూ ఈ ప్రపంచాన్నే మర్చిపోయినట్లు ఎంతో కౌతుకంగా తన కళ్లల్లోకి చూసేవాడు. క్షణక్షణానికీ చెరకు వింటి బాణాలను వదిలేవాడు. తామిద్దరిమధ్యా ఆంక్షల వలయాలు చెరిగిపొయ్యేవి. అప్పుడింక కాంక్షల కేబరా డాన్సులు మొదలయ్యేవి.

అమ్మో...కాంక్షలంటే అవి కేవలం మోహినీ పిశాచాలే! దగ్గరగా వచ్చి, మనకు వచ్చి, నమ్మకంగా అరచేతిని అందిపుచ్చుకుని, నెమ్మదిగా తమవెంట నడిపించుకుని వెళ్తాయి. మనకోసం ఒక్కటొక్కటిగా నవస్వర్గధామాల ద్వారాలు తెరుస్తాయి. మనం ఎదురుగా చూస్తే, కనుగీటి చెయ్యూపి లోనికి రమ్మని పిలుస్తాయి. అన్నీ తెల్సినా ఆ కాసేపూ మైమరిచిపోయి వెళ్తాంగదా. మన వెనక వెనక్కి వెళ్ళే అవకాశాల తలుపులు దభేల్‌మని మూసేస్తాయి. ఇంక అప్పుడా కాంక్ష అనే కామినీ పిశాచం, చుట్టూ పరిస్థితుల కౌగిలి బిగించి బలంగా నొక్కుతూ, బాధ్యతల గోళ్లతో ములవాన రక్కుతూ ఉంటే, బాధేగాని సుఖం ఉండదు. అప్పుడక్కడ ఆశించిన స్వర్గమూ ఉండదు. కలలు గన్న దుర్గమూ ఉండదు. ఎప్పుడో కళ్లుతెరిచిచూస్తే, తెలివి తెల్లగా తెల్లారాక చూస్తే, ఊరి బయట పాడుబడ్డభవంతిలో

విశ్రాంతిలో మనం ఉండగా, జరిగీ జరగని ఆశ నిరాశల రాక్షస కామక్రీడా కలాపాలు ! అంతకుముందు మనం ముందుకువస్తూ క్రిందికి నెట్టేసిన వాళ్లు చుట్టూ కనిపించకుండా ఉండి వినిపించే విలాపాలు !! పైగా నిర్గతిలేని దుర్గతి !...తన గతీ అలానే అయింది. ఈ కాంక్షలే తనని మోసపుచ్చి, మభ్య పెట్టి, ఆయన కౌగిల్లోకి నెట్టి ... తీరా తెలివి తెచ్చుకునేటప్పటికి చాలా ఆల స్యమైపోయింది ! తను ఒంటరిగా ప్లాట్‌ఫాంమీద మిగిలిపోయింది.

అతి నిరాడంబరంగానే అయినా, ఆయనతో తన పెళ్ళి జరిగిపోయింది. మిస్ నిర్మల ఎమ్మే అయినతను మిసెస్ కృష్ణమోహనరావు అయిపోయింది. అంతా తన ఫ్రెండ్సేగాని ఆయన తరఫు నుంచి ఒక్కరూ రాలేదు. ఎందుకని అడిగిడే కౌగిలి లోగిలిలోకి లాగి సమ్మోహనంగా నవ్వేశాడు. మారు మాట్లాడకుండా తన నోరు తెరవకుండా ఉక్కిరి బిక్కిరి చేశాడు.

ఆ రోజుల్లో తన జీవనవనంలోని ఊహాల వృక్షాలనిండా రంగురంగుల మోహాల పూలుపూసి గుత్తులుగుత్తులుగా వేలాడుతుండేవి. అప్పుడా ఆనంద సీమలో సువర్ణ రజిత మణిమయ ఖచిత కిరీటాలు ధరించి ... ఉత్సవులు ధరించిన ... స్వప్నాలెన్నో కళకళలాడుతూ, ... కళ్లముందు కదలాడుతున్నట్లే ఉండేవి క్రమంగా ఉదయారుణ కిరణాలు విస్త రించేటప్పటికి, భ్రమలుగొలిపే వెన్నెల కాంతులు వెలాతెలా పోయినయి. అను రాగ రాగ గీతమాలికలు మార్మోగిన తన బ్రతుకు బృందావనం, ఇప్పుడు అయిష్టపు కీచురాళ్ల ధ్వని ప్రతిధ్వనించే కీకారణ్యం ... ప్చ్ ... ఈ బ్రతుకొక భ్రాంతి.

రోజూ విసుగులేకుండా రొటీన్‌గా మనం ఆడుకునే ఈ ఆశనిరాశల ఆటలో తుదిగెలుపు ఎప్పుడూ మనది కాదు. అంతంచూసే మృత్యువుది. దాన్ని జయించలేదింతవరకూ ఈ ఆరడుగుల మనిషి.

దూరంగా ఎక్కడో, ఎవరో తన కబంధహస్తాలతో ఆకాశాన్ని అప్పుడంలా విరిచేసినట్లు ఫెళఫెళమని ధ్వని. దాన్ని వెన్నంటి తళుక్కుమని వెలిగి ఆరి పోయిన కాంతి కిరణం. క్షణంసేపు భరించలేని వెలుగు కొరడా ఝుళిపించి నట్లు వెలిగింది

ఇదుగో ఇల్లాంటి మెరుపు వెలుగు లాంటిదే ఆయనతో తను తాత్కాలికం వెలగబెట్టిన ఆ మూడునెలల ముచ్చ టాను. ఇంత వెలుగు ఉండగా ఇంక ... తక్కువ ... ఆదంతా ఎంత భ్రమ ! ... సంతోష ... మనమైపోయింది. ఇప్పుడు గట్టిగా ... సుకున్న ఈ

చీకటి మునుపటికన్నా మరింత దట్టంగా ఉంది.

తర్వాత ఎప్పుడో తెల్సుకుంది, ఆయనకో భార్య ఉందనీ, ఇద్దరు పిల్లలు ఉన్నారనీ. తెల్సిన క్షణంలో పిడుగుపడింది. ఆ పిడుగుపాటు తగిలి తనలోని ఉత్సాహం ఉన్నపళంగా చచ్చింది.

"ఏమిటిదంతా ?" అని అడిగితే, చిద్విలాసంగా నవ్వేసి, ఎప్పట్లా బుగ్గ మీటేసి, "ఇప్పుడు నీ కొచ్చిన నష్టం ఏమిటి ?" అన్నాడు.

నష్టం ... బ్రతుకును కాష్టంలోకి ఈడ్చాక ఇంక లాభనష్టాల ప్రసక్తి ఏముంది ? ఆ తర్వాత తనను ఎప్పటిలా నవ్వించాలని ఆయన ఎన్నో పాట్లుపడ్డాడు. మొక్కుబడిగా ఎవరి ముందన్నా బలవంతంగా నవ్వుతెచ్చుకున్నా, మునుపటిలా స్వచ్ఛంగా ఇంక తను నవ్వలేదు. అమావాస్యనాడు తెల్లని పున్నమి వెన్నెల ఎల్లాకాస్తుంది ? అశ్రువులు కురిసే సమయాన, ఆనందాతిహాసం ఎల్లా వెల్లివిరుస్తుంది ? లోకం అంతా తనని చూసినవ్వుతుంటే, తను నిండుగా ఎలా నవ్వుతుంది ?

ఈ జీవుం జాతకాలు, తను కాసుతో నిలబడి నల్లబల్లమీద చాక్‌పీస్‌తో రాసే వ్యాసాలు కావు గదా, పదే పదే చెరిపి వేయటానికీ, తిరిగి మళ్ళీ క్రొత్తగా రాయటానికీను. తీసుకున్న నిర్ణయం తప్పు అయినా, చేసుకున్నాక ఇంక తప్పదు గదా మరి. అందుకని సహనాన్ని సలహా అడిగింది. అదేమో ఇంక నోరు మూసుకుని పడి ఉండమంది. 'కాదంటే, నువ్వు నీతిమాలినదానివని నీ జాతి అంతా నిన్ను వెలివేస్తుంది. చుట్టూఉన్న తుంటరులకు నీ ఒంటరి బ్రతుకును బలి చేస్తుంది. జాగ్రత్త సుమా' అని హెచ్చరించింది.

పొద్దున లేచినప్పటినుంచీ ఈ ఆడంగు లంతా సమానత్వం అంటూ, వేదిక లెక్కి, పిడికిలి పైకెత్తి, ఎలుగెత్తి అరుస్తుంటే, వీళ్లెంత అవివేకులో అని పిస్తుంది. ఇప్పుడు సమానత్వం లేదా ? అర్హత ఉన్నవాళ్లకు ఎప్పుడూ ఉన్నది గదా. వ్యక్తిగత స్వేచ్ఛ, సమానత్వం అనేవి ధైర్యసాహసాలు లాగా మనకు మనం వెంట తెచ్చుకోవాలిగాని ఒకరిస్తే పుచ్చుకునేవా అవి ?

కృష్ణమోహనరావుతో తను సమానం కాదా ? అందంలో, చదువులో, సంపాదనలో తెలివితేటల్లో అన్నిట్లోనూ ఆయనకన్నా తాను అధికురాలు. అయినా ఆయన ముందు తనెందుకింత నిస్సహాయురాలై పోయింది ? ఆయన వ్యాపారస్థుడు గనుక, మోసం చెయ్యగలిగితే మాత్రం తను జాగ్రత్తపడవద్దా ? పడింది. తర్వాత ఆయనతో సరిపడ లేదు. రాజీ పట్టుకుని ముందుకుపడితే

ఎవరినితిట్టాలి? రాయినా ఆ దారినా, మందగించిన తన ముందుచూపునా?

గిట్టలేదు కదాని కట్టుకున్న భర్తను, కట్టుకున్న బట్టను విడిచేసినంత తేలిగ్గా విడిచేసి, తేలిగ్గా గాలిపీల్చుకోగలిగిన సమాజం కాదుగదా మనది. అప్పుడుండే ఇబ్బందులు అప్పుడూ అంటాయి మరి.

ఆయన తన ప్రథమ కళత్ర పుత్రికా రత్నాన్ని తెచ్చిపెట్టి, దాన్ని తన కన్నబిడ్డగా భావించుకుని పెంచి పెద్దజేసి మనవళ్లనూ, మునిమనవళ్లనూ ఎత్తుకుని, హృదయానికి హత్తుకుని తరించమన్నాడు. ఈ అవమానాన్ని సహించటం ఎట్లాగని పొట్లగిత్తలా మనసెంత ఎదురు తిరిగినా, రాద్ధాంతం చేసి సాధించే సుఖశాంతు లేమీలేవు గనుక గతిలేక ఖర్మసిద్ధాంతాన్ని తల్చుకుంటూ కూర్చుంది. ఆ పిల్లకు తనపొడ గిట్టదు. ఈ ఇంట్లో తామిద్దరూ ఒకే ఒరలోనున్న రెండు కత్తుల్లా ఉన్నారు.

ఈ పిల్లనీ, దీని అబ్బనీ తోలు బొమ్మల్లాచేసి, వెనకనుంచి తాళ్ళు లాగుతూ తన ఇష్టంవచ్చినట్లు ఆడిస్తున్నది, నాయకురాలు నాగమ్మలాంటి దీని అమ్మ.

ఆమెకున్న జాగర్తలో వందోవంతు తనకు ఉంటే, ఈ కథ ఇంకొక రకంగా ఉండేది. కృష్ణమోహనరావును ఆరంభంలో లాగానే, వదలకుండా తన పరిరంభంలోనే బంధించి ఉంటే ఎలా ఉండేది? ఆవిడా, ఆమె పిల్లలూ వాళ్ళ పంచకిందా, వీళ్ల చూరుకిందా చేరి అంట్ల గిన్నెలు తోముతూ, ఎంగిలిమెతుకులు కెలుకుతూ ఉండేవాళ్ళు. తనది జాలి గుండె కాబట్టి "అయ్యో పాపం" అనుకుంది. అలా అనుకుని ఆయన్ని తిరిగి వాళ్లదగ్గరికి వెళ్లనివ్వటమే తాను చేసిన పాపం అయింది.

భర్తనుంచి తాను ఆశించిన సుఖశాంతులు అంతగా లేకపోయినా, పోనీ ఒకరిద్దరు పిల్లలయినా కలిగితే, వాళ్లను చూసుకుంటూనయినా బ్రతుకుదామనుకుంటే, ఆ ఆశా నిరాశచేసింది నాగమ్మ. తనకు సంతానం కలిగితే, దాన్నీ, దాని పిల్లల్ని చూడదేమోనని కుశంకలు పెంచుకుని, ఆయన్ని మభ్యపెట్టి, బలవంతపెట్టి, ఆయన కింక పిల్లలు కలగకుండా ఆపరేషను చేయించింది. ఇది తన కడుపులో చిచ్చుపెట్టటం కాదా?

నాగమ్మగారి పథకం ప్రకారం కొన్నాళ్ళు పొయ్యాక, ఆయన ఈ కొరకరాని కొయ్యనుతెచ్చి, తనకిచ్చి "దీనికి నీవు తల్లివి" అన్నాడు.

తను తల్లిలాంటిదన్న భావన దానికి లేదు. అది కూతురులాంటిదన్న ఆలోచన తనకూ రాదు. కడుపులో లేనిది కావలించుకుంటే వస్తుందా? ఏమో, మగవాణ్ణి కావలించుకుంటే, ఎన్నటికయినా కడుపొస్తుందేమోగాని, ఆడదాన్ని మరో ఆడది కావలించుకుంటే



చెమటకంపు తప్ప మరేమీ రాదు. ఈ మాత్రం గూడా ఆయనకి తెలియదా ? ఇంతకీ ఇదంతా తన ఖర్మ.

నిర్మలకు మళ్ళీ ఆకలి గుర్తొచ్చింది. గొంతు తడారిపోయింది. పొడిగా దగ్గువచ్చింది. ఓపికతెచ్చుకుని నెమ్మదిగా లేచి, గదిలోని లైటువేసింది. వంటింటి తలుపుతీసి లోపలికి నడిచింది. కూజాలోని నీళ్ళు రెండు గ్లాసులు గడగడా తాగి చుట్టూచూసింది. బేబులు మీద అన్నం, కూరా ఉన్న గిన్నెలు ఉన్నాయి. అటూ, ఇటూ రెండు కంచాలు, మధ్యలో మంచినీళ్ల జగ్, రెండు గ్లాసులూ ... అన్నం గిన్నెమీద మూత మూషికరాజులు తీసి చూసినట్లు న్నారు అప్పడాలు. వడియాలూ చవి చూడాలని చూసినట్టున్నారు. పళ్లెం పక్కన పడున్నాయి. అవన్నీ సర్దుతూ, అపర్ణ తినే కంచంవైపు చూసింది. తళతళామెరుస్తున్న ఆ పళ్లెంలో ఒక సాలెపురుగు ప్రాకుతోంది. దానికోసం కాబోలు బల్లి గోడమీద కాపువేసింది ఈ పురుగు చూడకుండా తిండిలో కలిసిపోతే, ప్రాణానికేమన్నా ముప్పా ? ఏమో...

ఖర్మకొద్దీ ఇలాంటి దేమన్నా జరిగితే, తనే గిట్టక చంపిందని నలుగురూ అనరూ ? ఆయనమాత్రం ఊరుకుంటాడా ? నాయకురాలు నాగమ్మ తనని బ్రతకనిస్తుందా ?

కంచాలు కడిగి బోర్లించి, మళ్ళీ ముందుగదిలోకి వచ్చింది. ఇంకా చినుకులు రాలుతూనే ఉన్నాయిగాని, ఇందాకటి అంతటి ఉధృతం లేదు.

చల్లగాలి రయ్యమని వీస్తుంటే. బాల్కనీ పిట్టగోడదాకా వచ్చి వీధి

చివరిదాకా చూస్తూ నిలబడింది. ఇది ఎంతకీ రాదేమిటి ? ... ఎక్కడ, ఎవడితో ... దీని కెవరు కాపలా కాయ గలరు ? ఇంతకీ దాన్ని ఇక్కడ ఉంచటంలో ఆయన ఆంతర్యం, దానికి తను కాపలా కాయాలనా, తనకు అది కాపలా కాయాలనా ? అసలు మనసు అవినీతివైపు మొగ్గకుండా ఎవరికివాళ్ళే జాగ్రత్తపడాలిగాని, మరొకరు పట్టి లాగితే ఆగుతారా ? అవినీతినుంచి నీతికి, అంటే దిగువనుంచి ఎగువకు ప్రాకటం కష్టంగాని, పైనుంచి క్రిందకు జారటం ఎంతో తేలిక. పైగా పిల్లలకు అదెంతో సరదాగా గూడా ఉంటుంది.

రోడ్డుమీద వర్షంనీరు గూడా ఎగువ నుంచి దిగువకు దూకుడుగా పారు తోంది, గలగలలాడుతూ. ఊరంతా నిర్మానుష్యంగా ఉంది. లోకమంతా నిద్దరమత్తులో ఉంది. వీధి దీపాలు నడుం వంగిన వయోవృద్ధుల్లా ఉన్నాయి. వాటి వెలుతురు చత్వారం వాడిచూపులా నేలమీదకు ఆనీ ఆనకుండా ఉంది.

పారే ఏరులా ఉన్న నీటిని చిమ్ము కుంటూ తన ఇంటిముందుకు వచ్చి ఆగిందో టాక్సీ. దానిలోనుంచి అపర్ణ దిగింది. అందులోనున్న పరపురుషు డెవడో వీడ్కోలుగా చెయ్యి ఊపాడు.

వాడికి టాటా చెప్పి ఇది పైకి వస్తుం డగా, టాక్సీ వెనక్కి మళ్ళిపోయింది. మెట్లెక్కి వచ్చి అపర్ణ నిర్మలవంక ఒక సారి నిరసనగా చూసి, విసురుగా తల ఎగరేసి లోపలికి వెళ్ళిపోయింది. బట్టలు మార్చుకుని బాత్‌రూంలోకి వెళ్ళి మొహంకడుక్కుని వచ్చింది. టవల్‌తో తుడుచుకుని, అద్దంలో చూసుకుంటుండే వెనకనుంచి నిర్మల అడిగింది చాలా సౌమ్యంగా.

"ఎవడు వాడు ?"

"...ఫ్రెండ్..." ముక్తసరిగా బదులు చెప్పి ఊరుకుంది అపర్ణ.

"ఇప్పటిదాకా ఏంచేస్తున్నారు ?"

"పిక్చర్ కెళ్ళాం..."

నిర్మల కాసేపు మౌనంగా ఊరు కుంది. అపర్ణ అద్దం ముందునుంచి కదిలి, తుండుగుడ్డ దండెంమీద ఆరేసి వచ్చి మంచంమీద కూర్చుంది.

"ఇప్పుడు టైం ఎంతయిందో తెలాస్సా ?" అని అడిగింది నిర్మల.

అపర్ణ ఒకసారి క్రోధంగా చూసి ముహం చిట్లించుకుంది. నోరు మెదప లేదు.

"నిన్నే అడిగేది ?" అని రెట్టిం చింది నిర్మల. దాంతో "కంయ్‌" మని మీద పడ్డది అపర్ణ.

"నన్ను అడగటం ఎందుకు ? నీకు టైం ఎంతయిందో తెల్సుకోవాలంటే వాచీ చూసుకో."

"నేను చూసుకుంటూనే ఉన్నాను. నువ్వు ఎంతసేపటిదాకా ఎక్కడెక్కడ తిరుగుతున్నావో చూసుకుంటున్నా వా

అని ?" నిర్మల గూడా స్వరం పెంచింది.

"నువ్వు నాకేం చెప్పక్కర్లా. నా కన్నీ తెల్సు."

"నా కన్నీ తెల్సు అనేవాళ్ళకు ఏమీ తెలీదు అని అర్థం."

"నువ్వు నాకేం పాఠాలు చెప్పక్కర్లా."

"నీకు పాఠాలు చెప్పమనే, చెప్పించమనే మీ నాన్న నిన్ను ఇక్కడ పెట్టి వెళ్ళాడు। అర్ధరాత్రి దాటేదాకా ఈ తిరుగుళ్లేమిటి ? ఎక్కడికెళ్ళావు ? ఏం చేస్తున్నావు ? చెప్పు..."

"పార్టీ..."

"ఏమిటీ ?"

"కొంతమంది ఫ్రెండ్స్ కల్సి ఒక గొలుసు నవల రాశాం. అది అచ్చవబోతోంది. మేం అంతా కల్సి ఇవాళ పార్టీ చేసుకున్నాం. అన్నపూర్ణాలో భోంచేసి, రామకృష్ణలో సెకండ్‌షోకి వెళ్లాం. చాలా. ఇంకా ఏమన్నా కావాలా ?" అన్నది అపర్ణ రోషంగా చూస్తూ.

నిర్మల పోతున్న సహనాన్ని పిల్చి తోడుతెచ్చుకుని, నెమ్మదిగా చెప్పింది.

"చూడు అపర్ణా, ఇప్పుడు నువ్వు యవ్వనారంభావేళలో నున్నావు. పాల పొంగులాంటి వయసు తరుముకుంటూ వెళ్తుంటే, పర్యవసానాలను గురించి ఆలోచించుకునే తీరికా, ఓపికా ఉండని రోజులివి కానీ ఇప్పుడు కుదురుగా నడవకపోతే, తొందరపడితే, ముందుకు పడితే, జీవితంలో ఇంక లేవలేవు. చేయూతనిచ్చి, లేవదీసి, వెంట నడిపించుకుని తీసుకు వెళ్ళేవాళ్ళు ఉండరు అంతదాకా వచ్చాక, కన్న వాళ్ళు గూడా ఎవరి ఖర్మ వాళ్ళదని వదిలేసి ఊరుకుంటారు..."

"నేనేం చేశానిప్పుడు ?"

"చేశాక, ఇంక మనం చెప్పటానికి, నోరువిప్పి చెప్పుకోవటానికి ఏమీ ఉండదు. మనం ఎవరికీ ఏమీ చెప్పక పోయినా, అప్పుడు లోకమంతా మన గురించే చెప్పుకుంటుంది"

"అంతా నీ లాగే ఉండరు" ఆ మాట కొరడా దెబ్బలా తగిలింది నిర్మలకు.

నిర్మల ఉలిక్కిపడ్డది. అయినా ఇలాంటి వన్నీ అలవాటే గనుక వెంటనే తమాయించుకుని, ఇంకా శాంతంగానే అన్నది.

"నాలా ఎవరూ ఉండకూడదనే కోరుకుంటున్నాను తల్లీ. నేనొక శాపగ్రస్తురాల్ని. నన్నిలా ఉండమని శపించింది మీ నాన్న. అయినా, నేను మీ అందరి బాగుకోసమే తపించి పోతున్నాను. కానీ నేను మీకు గర్భ శత్రువులా కనబడుతున్నాను. దీని కంతటికీ కారణం ఏమిటని ఇప్పుడు ఆలోచిస్తే, అదుగో అప్పుడు

ఆలోచించకుండా అలా చేసుకోవటం వల్లనేనని..."

"ఇష్టంలేకపోతే వెళ్ళిపోవచ్చుగా. మమ్మల్ని పట్టుకుని వేళ్ళాడ్డం ఎందుకూ?" అన్నది అపర్ణ మంచం మీద వెనక్కి వాలి పడుకుంటూ.

ఆ మాటతో నిర్మలకు సహనం చచ్చిపోయింది. కోపం హెచ్చిపోయింది. "ఎందుకా? ఎందుకంటే నీలా నాకింత గడ్డిపెట్టే వాళ్లెవరూ లేరని, మిమ్మల్ని పట్టుకుని దేవుళ్ళాడుతున్నానే పాపిష్టి ముండా?"

అపర్ణ చట్టున లేచి కూర్చున్నది. "ఏవమ్మోవ్, మాటలు జాగర్తగా రానీ. ముండా, గిండా అన్నావంటే మర్యాదగా ఉండదు ఇంకా నువ్వే మా నాన్నకు ముం..."

"నోర్ముయ్. విశ్వాసఘాతకురాలా. నీ కోసం, నీ యబ్బకోసం, నేను పరువూ, మర్యాదా, సిగ్గూ, అభిమానం అన్నీ విడిచేసి తిరుగుతున్నానే. నేనే గనక తల్చుకుంటే మిమ్మల్ని అందర్నీ నిలవనీడలేకుండా చేసి, చెట్టు కింద కాపరం పెట్టించేదాన్ని. నా మంచితనం మీకు చేతగానితనంగా కనపడుతోంది. రేపట్నించీ చూపిస్తాను నా తడాఖా..."

"ఏం చేస్తావేంటి?"

"ఏమైనా చేస్తాను, ముందు నీ భాగోతమంతా మీ నాన్నకు చెప్తాను".

"నీ భాగోతం నేనూ చెప్తాను."

"ఏమిటే నా భాగోతం?" అని గదిస్తూ ముందుకొచ్చింది నిర్మల.

"నా భాగోతం ఏమిటి" అని రెట్టించింది అపర్ణ.

"అర్ధరాత్రి దాటాక టాక్సీలో తీసకొచ్చి దించుతున్న వాడెవడే? నీకేమవుతాడే? ఫ్రెండ్ ట ఫ్రెండ్ ... బోడి ఫ్రెండ్."

"నా యిష్టం నువ్వు అనవసరంగా మాటలంటే పడి ఉండేవాళ్ళెవరూ లేరిక్కడ."

"పడి ఉండకపోతే పోవే నీ యిష్టం వచ్చిన వాడితో లేచి పో."

"పోతాను. ఇప్పుడే పోతాను. నీచేత ఈ మాటలు పడటంకన్నా, హుస్సేన్ సాగర్‌లో దూకిచస్తే నయం" అని లేచి విసురుగా వెళ్ళిపోతున్న అపర్ణ వెంట పడి వాక్కిలిదాకా దాదాపు పరుగెత్తుకుని వెళ్ళి, చెయ్యిపట్టుకుని బలవంతంగా వెనక్కిలాక్కొచ్చి, విసురుగా మంచం మీదకు తోసేసింది నిర్మల.

"కదిలావంటే చంపేస్తాను. నోరు మూసుకు పడుండు. ఈ అర్ధరాత్రి నువ్వెందులోనన్నా దూకి చస్తే, పోలీసులు నన్ను చంపుకుతింటారు. నీకు ఇష్టంలేకపోతే, మీ నాన్నను పిలిపిస్తాను. నే చెప్పేది నే చెప్తాను. నువ్వు చెప్పేది నువ్వూ చెప్పు. ఆ తర్వాత ఆయనా, నువ్వూ పోయి ఏ గంగలో నన్నా దూకండి. నాకేం పట్టదు..."

అపర్ణ మంచంమీద బొక్క బోర్లా పడి వెక్కి వెక్కి ఏడుస్తూ, మధ్యమధ్య చీదేస్తూ, కాసేపటికి నెమ్మదిగా కునుకేస్తూ, లేస్తూ, మళ్ళీ రోదిస్తూ రాత్రంతా గడిపేసింది.

నిర్మల తలుపు గడియవేసి, గుమ్మానికి అడ్డంగా తన కుర్చీవేసుకుని కూర్చుని, అందులోనే కునికిపాట్లు పడుతూ ఆ రాత్రంతా గడిపేసింది.

తెల్లారి లేచాక మళ్ళీ ఎవరి పనుల్లో వాళ్ళు మునిగిపోయినారు. నిర్మల కాలేజీకి వెళ్ళింది అపర్ణ గూడా పుస్తకాలు పుచ్చుకుని రోజూలాగానే ఇల్లు వదిలి వెళ్ళింది.

ఆ తర్వాత రెండురోజులు గడిచినా అపర్ణ ఇంటి ముహం చూడలేదు. నిర్మల ముహం పెంకులా మాడిపోయింది. ఆమె గాభరాపడింది. కంగారు ఎక్కువైంది. వెతుకుదామంటే, ఆ పిల్లకు స్నేహితులెవరెవరో, ఎక్కడున్నారో గూడా నిర్మలకు తెలియదు స్కూల్లో కనుక్కుంటే అక్కడికి రాలేదని చెప్పారు.

క్లుప్తంగా విషయం తెలియజేస్తూ వెంటనే బయల్దేరి రమ్మని కృష్ణమోహనరావుకి టెలిగ్రాం ఇచ్చింది.

ఆయన రావటం రావటమే నిప్పులు కురిపిస్తూను, చిందులు తొక్కుతూనూ వచ్చాడు.

"దాన్ని ఏం చేశావు నువ్వు ? నిజం చెప్పు..." అని దండించాడు.

"నేనేమీ చెయ్యలేదు. అర్ధరాత్రిళ్ల కొంపజేరుతుంటే, ఇలాగయితే నా దగ్గర ఉండొద్దన్నాను ఆ మాత్రానికే దానికి పౌరుషం పొడుచుకొచ్చింది" అని వివరించబోయింది నిర్మల ఆయనకు వినే ఓపిక లేకుండా ఉంది. చిటపటలాడుతున్నాడు.

"అది పసిపిల్ల. దానికి తెలియక ఏదన్నా తప్పుచేస్తేమాత్రం నువ్వు చెప్పే విధంగా చెప్పాలిగాని, దాన్ని చెదగొట్టింది చాలక, ఇల్లు వెళ్ళగొడతావా ?"

"అదుగో ఆ మాటే అనొద్దు నేను నీ కోసం, నీ పిల్లలకోసం ఏంచేసినా, అది నాకే ఎదురు తిరిగి కొడుతోంది. నీకో నమస్కారం పెడతాను. నన్నిలా వదిలేసి పొండి." అని తప్మని శబ్దం చేస్తూ రెండుచేతులూ మ్రోగించింది.

"ఏం వాళ్ళు ఎలా ఉందే ? కట్టుకున్నవాణ్ణి పొమ్మని ఏం చేద్దామని ?"

"వంగంలో దూకుదామని. నిన్ను కట్టుకున్నప్పుడు గూడా తెలియకుండా నే చేసిన పని అదే. నిర్వింతలా తడి గుడ్డతో గొంతులు కోసే రకమని తెలియక..."

ఆ మాటతో కృష్ణమోహనరావు ఆవేశాన్ని పట్టలేకపోయినాడు ఛెళ్ళుమని నిర్మల చెంపమీద కొట్టాడు. మునిపంటితో క్రింది పెదవిని నొక్కిపెట్టి దుఃఖం అపుకుంటున్న ఆమెకు ఆ దెబ్బతో దిమ్మ తిరిగిపోయింది. క్రింది పెదవికి పైపన్ను గుచ్చుకుని నెత్తురు చిమ్మింది. అరచేత్తో పెదవిని తుడుచుకుని, రక్తాన్ని చూసుకునేటప్పటికి, నిర్మల గుండెల్లో కోపం రెల్లుగడ్డిలా భగ్గున మండింది. ఆమె అహం గుండు దెబ్బతిన్న సింహంలా ఎదురు తిరిగింది.

"నన్ను కొడతావా నువ్వు? ఎక్కడిది నీకీ హక్కు?" కాళికాదేవిలా మారి కళ్ళల్లోనుంచి నిప్పుల వర్షం కురిపించింది, ఎప్పుడూ నిండుకుండలా నిర్మలంగా ఉండే నిర్మల

"భార్య భర్తకు అణిగి మణిగి ఉండాలి లేకపోతే సామ దాన భేద దండోపాయాలు ఉండనే ఉన్నాయి..." అని తనను తాను సమర్థించుకోబోయినాడు కృష్ణమోహనరావు

"నన్ను చావగొట్టే మొగాడు దొరకడనా నిన్ను కోరి చేసుకుంది? భార్య మెళ్లో తాళిగట్టటానికీ, గొర్రె మెడలో తాడుకట్టటానికీ తేడా లేదనుకునే నిన్ను గుడ్డిగా వరించటం నాదే పొరపాటు పసుపుతాడు కంఠానికి బిగించి, రోజు రోజూకూ బిగించి లాగుతూ దాన్నే ఉరితాడుగా మార్చిన నువ్వు నాకు భర్తవెలా అవుతావు? నువ్వు నా శత్రువ్వి ద్రోహివి నీచుడవు..."

కృష్ణమోహనరావు క్షణకాలం దిగ్భ్రమ చెంది నిరుత్తరుడైనా తమాయించుకుని ఇంక రాజీమార్గానికి రావాలనుకున్నాడు

"నిర్మలా నువ్వెవరితో మాట్లాడుతున్నావో తెలుస్తోందా? నువ్వు కోపంతో కాదన్నంత మాత్రాన చెరిగిపొయ్యేదికాదు మన సంబంధం భార్యాభర్తల అనుబంధం, జన్మ జన్మల బంధం..."

"నీ బొంద బంధం గెటవుట్... ఇంకా ఇక్కడే తగలడావేం? పో... పొమ్మంటుంటే..." వర్షించే మేఘంలా ఏడుస్తూనే ఉంది, గర్జిస్తూనే ఉంది

"హుఁ నన్నుకాదని నువ్వెలా బ్రతుకుతావో అదీ చూస్తాను" అంటూ కృష్ణమోహనరావు రోషంగా బుసకొట్టి, పెద్ద పెద్ద అంగలతో అక్కడినుంచి వెళ్ళిపోయినాడు

ఇన్నేళ్ళ జీవితంలో ఎన్నడూ ఒకరిచేత ఒకమాట చెప్పించుకోవటం ఎరుగని నిర్మల, ఈ కృష్ణమోహనరావు చేతిలో చావుదెబ్బతిన్నది ఆ నిస్తేజంలోనుంచి తేరుకోకముందే, పక్కవాటాలోని కరుణాకరం వచ్చి పలకరించాడు

"ఏమిటి నిర్మలగారూ, ఏదో గొడవ పడుతున్నట్లున్నారు...అరెరె, ఆ రక్తం ఏమిటి?" అంటూ చొరవగా దగ్గరకి రాబోయినాడు

"నాకేం ఫర్వాలేదు దయచేసి నన్నిలా వదిలెయ్యండి మీకో నమస్కారం పెడతాను" అంటూ దాదాపు అతన్ని బయటికి గెంటేసి, ధన్‌మని తలుపుమూసేసింది

నిర్మల పరుపుమీద పడిపోయి, బాణందెబ్బతిని రక్తాన్ని స్రవిస్తున్న నెమలిలా, కళ్ళల్లోనుంచి నెత్తుటి కన్నీటిని బొట బొట కారుస్తున్నది

కిటికీలోనుంచి విసురుగా లోపలికి దూసుకొచ్చి, మొరటుగా మీదబడి జుట్టును చెదరగొడుతూ, ఒంటిమీద బట్టల్ని ఎగరగొడుతున్నది హోరుగాలి

ఎవరికింక జాలి